TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 58 | 09 బుధవారం సెప్టెంబర్ 2026 | పేజీలు:04

అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం

వార్త దీపిక న్యూస్ :

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసం గం చేశారు. 'పొలిటికల్ కమ్యూ నికేషన్ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలక్కుద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు.

నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ

భావోద్వేగం...

● వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
● స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
● వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
● పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
● మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్



గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొం గిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. ...మిగతా 2 లో...



'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

కేటీఆర్ సంచలన ఆరోపణలు

● కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
● కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
● ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
● అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
● దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ...మిగతా 2 లో...



మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

● కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన
● పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి
● తనకు మంత్రి పదవి ఇవ్వడం అధి ష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఎమ్మెల్యేలతో చావు రాజకీయాలు చేయిస్తారా?: వేముల ప్రశాంత్ రెడ్డి నిప్పులు

● కేసీఆర్‌ను అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్న ప్రశాంత్ రెడ్డి
● కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే అని ఆరోపణ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతి కంగా అంతమొందించేందుకు కాం గ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నార ంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేము ల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

...మిగతా 2 లో...

ప్రధాని మోదీ సభ వేదిక వద్ద

కలకలం...

● నకిలీ పీఎంఓ ఐడీ, గన్‌తో ఇద్దరు అదుపులోకి!
● ఒకరి వద్ద నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, మరొకరి వద్ద గన్ గుర్తింపు
● ముంబైలోని అంబానీ కల్చరల్ సెంటర్‌లో ఘటన
● భద్రతా డ్రిల్ నిర్వహిస్తుండగా పట్టుకున్న పోలీసులు
● గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొననున్న ప్రధాని మోదీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న కార్యక్రమ వేదిక వద్ద కలకలం రేగింది. నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో భద్రతా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఏసీసీ) వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం జరగనున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2026' ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పోలీసులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ డ్రిల్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా, 24 ఏళ్ల రోహన్ పరేఖ్ అనే వ్యక్తి తనను తాను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డును పరిశీలించగా అది నకిలీదని తేలింది. అదే సమయంలో అతని గన్ మన్ వద్ద ఉన్న తుపాకీని కూడా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.వెంటనే వారిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు, తదుపరి దర్యాప్తు నిమిత్తం ఈ కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. ప్రస్తుతం అధికారులు వారిని ముమ్మరంగా విచారిస్తున్నారు. వారి మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర సామాగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయిన అనంతరం వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని పర్యటనకు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

● బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసే ఛాలెంజ్
● అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న కోమటిరెడ్డి
● తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్ష

తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ...మిగతా 2 లో...






మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్

● దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
● సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
● మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయడు ఏమీ ఎరు గనట్లు తప్పించుకోవాలని చూస్తు న్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

● తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందన్న స్పీకర్
● బీఆర్ఎస్‌లా సస్పెన్షన్ల సంస్కృతి తమది కాదని స్పష్టీకరణ
● ఈ వ్యవహారంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. ...మిగతా 2 లో...

స్పీకర్‌ను బెదిరించే హక్కు హరీశ్‌రావుకు ఎవరిచ్చారు..?

● స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి మీరెవరని ప్రశ్నించిన శ్రీధర్ బాబు
● స్పీకర్ ను బెదరించేలా మాట్లాడటం సభా సంప్రదాయాలకు విరుద్ధమని వ్యాఖ్య
● స్పీకర్ పై దూషణలు వీడియో ఫుటేజీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడి



అసెంబ్లీ స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి హరీశ్‌రావు బెదిరింపు ధోరణిలో మాట్లా డటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమా దకరమని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీని ఏ రకంగా నడపాలనే దానిపై స్పీకర్‌కు ఆదే శాలు ఇవ్వడానికి, "ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు" అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని సూటిగా నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌ను బెదిరించేలా వ్యవహరించడం సభా సంప్రదాయాలకే విరుద్ధమని స్పష్టం చేశారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.“బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం” అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు.అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

స్పీకర్‌ను బెదిరించే హక్కు హరీశ్‌రావుకు ఎవరిచ్చారు..?

మొదటిపేజీ తరువాయి

స్పీకర్‌పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు.మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభ నిబంధనలకు కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోపాల్ రావుపేట రైతు వేదికలో వరి సాగులో రైతులకు సాంకేతిక అవగాహన:

వార్త దిపీక న్యూస్ :

రామడుగు మండలం గోపాలరావుపేట రైతువేదిక లో వ్యవసాయ శాఖ మరియు ఆత్మ ఆధ్వర్యం లో రికగ్నిషన్ ప్రియర్ లెర్నింగ్ ఆధారిత శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో భాగంగా డా.పి. మధుకర్ రావు సమన్వయకర్త ఉ అధిపతి టీఆర్వికే కరీంనగర్ వారు మాట్లాడుతూ వరి సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు. ముఖ్యంగా కలుపు యాజమాన్యం నీటి యాజమాన్యం పోషక యాజమాన్యం సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) సమగ్ర పోషక యాజమాన్యం (ఐఎన్ఎం)సమగ్ర తెగుళ్ల యాజమాన్యం (ఐడిఎం)సమగ్ర పంట యాజమాన్యం (ఐసీఎం)పద్ధతులను రైతులకు క్లుప్తంగా వివరించారు. పంట దిగుబడిని పెంచడం వనరులను సమర్థవంతంగా వినియోగించడం సుస్థిర వరి సాగును ప్రోత్సహించేందుకు ఈ సాంకేతిక పద్ధతులను రైతులు అవలంబించాలని వారు సూచించారు. యాసంగిలో దుక్కి దున్నకుండా వరి కొయ్యకాలులో మొక్కజొన్న పంట సాగు గురించి ప్రతీ రైతు కనీసం తను తినే ఆహారాన్ని పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం లో పండించుకోవాలని అందులోని మెళకువలు పద్ధతులను వివరించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రభావతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు సన్నరకాలు సాగు చేసిన రైతులు ఈ నెల 10 వ తేదీ లోపు సీడ్ డీలర్ వద్ద విత్తనాలు తెచ్చు కున్నట్లయితే డీలర్ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఒకసారి డీలర్ ని సంప్రదించి సరిచూసుకోవాలని ఒకవేళ రైతులు డీలర్ వద్ద కాకుండా స్వంత విత్తనం ఇతర రైతుల నుండి లేక పరిశోధన స్థానాలనుండి(కెవికె, పొలాస,కూనారం) తీసుకువచ్చిన వారు స్వీయ ధ్రువీకరణ పత్రం తో ఏఈఓని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.తప్పనిసరిగా ఈ నెల 10 వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని ఇది ప్రతీ రైతు బాధ్యత అని లేని యెడల 500/-బోనస్ వర్తించదని మండల వ్యవసాయ అధికారిని ప్రభావతి తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపాల్ రావుపేట సర్పంచ్ ఎడవెల్లి వనజ నరేందర్ రెడ్డి ఆత్మ బిటియం శ్రీమతి బి.స్రవంతి ఏఈఓ టి.అనంతరాజ్ ఏటిఎం సుమాంజలి రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలతో చావు రాజకీయాలు చేయిస్తారా?: వేముల ప్రశాంత్ రెడ్డి నిప్పులు

మొదటిపేజీ తరువాయి

ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు."వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్, హరీశ్ రావుల అరెస్ట్...

మొదటిపేజీ తరువాయి

వారిని అరెస్ట్ చేసి బోయిన్ పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై కేటీఆర్, హరీశ్ రావులు మండిపడ్డారు. శాంతియుతంగా వెళుతున్న తమను ఏ ప్రాతిపదికన అడ్డుకుంటున్నారని నిలదీస్తూ కేటీఆర్, హరీశ్ రావు రోడ్డుపైనే నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేతలను నిరోధించడమే లక్ష్యంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా... ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే శాంతిభద్రతల పరిరక్షణకు విధుల్లో ఉన్నామని పోలీసులు తెలిపారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ఎమ్మెల్యేలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.

బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

వార్త దిపీక న్యూస్ : .

రామగుండం-3 ఏరియా లోని ఎస్.ఎం.ఎస్ ప్లాంట్ నందు ప్రాజెక్ట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం ఏరియా లోని వి.కె.ఉపరితల గని (ఓ.సి) కి ప్రాజెక్ట్ ఆఫీసర్ గా బదిలీ పై వెళ్తున్న జి.శంకర్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, వివిధ విభాగాల అధిపతులు మంగళ వారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్టోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, కె.ఐలయ్య , సి.జె.సురేఖ, రవికుమార్, ఆర్.రాజేశ్వరి, ఆసిఫ్ యాసిన్, జ్ఞానసంబంధన్, కోల శ్రీనివాస్, మేఘన,డివై పియం ఎన్. వంశీధర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మెట్ పల్లి లో ఘనంగా విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు

వార్త దిపీక న్యూస్ : :

మెట్ పల్లి ఖాది హనుమాన్ మందిరంలో అరవై రెండవ విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సత్యానంద ఆశ్రమం శ్రీ విశోఖ తీర్థ స్వామి హాజరై ప్రసంగిస్తూ, 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మాన్ని మనం ఆచరిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది. ప్రతి ఒక్కరూ ధర్మరక్షణకు కంకణ బద్ధులై ముందుండాలని వారు కోరారు. వినాయక నవరాత్రులలో భక్తి పాటలు, భజనలు చేయాలని, అశ్లీల పాటలకు తావు ఇవ్వద్దని వారు కోరారు. విశ్వహిందూ పరిషత్ ను 1964 వ సంవత్సరమున శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ద్వితీయ సర్ సంఘచాలక్ పరమ పూజనీయ శ్రీ మాధవరావు సదాశివరావు గోల్ వర్కర్ (శ్రీ గురూజీ) స్థాపించారు. ఈ కార్యక్రమంలో గోనే భూమయ్య , విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పోహార్ తుకారాం, పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ మర్రి భాస్కర్, గుంటుక గంగాధర్, ముక్క నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం...

మొదటిపేజీ తరువాయి

"ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు.ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్

మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు."సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు.అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు.దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

మొదటిపేజీ తరువాయి

గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్‌వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు.ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలి





అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ శ్రేణుల వినతిపత్రం

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం

బిఆర్ఎస్ నాయకుల అరెస్ట్

సంగారెడ్డి, సెప్టెంబర్ 8, వార్త దిపీక న్యూస్ :

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచనల మేరకు పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరుపై ఆగ్రహం :

అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరును బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వచ్చిన ప్రజాప్రతినిధులపై నిర్బంధాలు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి మాట్లాడే హక్కు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. "ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, 420 హామీలు నెరవేర్చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం డౌన్ డౌన్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చింతా సాయినాథ్, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, హకీమ్, విజేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, చింతా సాయినాథ్, మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరి, నాగరాజు గౌడ్, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్, వేణుగోపాలస్వామితో పాటు పెద్ద ఎత్తున యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ భవిష్ త్ తరాలకు ఉపాధ్యాయులే సాధకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 8, వార్త దిపీక న్యూస్ :

ఒక దేశ భవిష్యత్తు ఆ దేశపు తరగతి గదులలో రూపొందించ బడుతుందని ఆ భవిష్యత్ సాధకులు ఉపాధ్యాయులని, వారి గురుతర బాధ్యత మరువ లేనిదని ముఖ్య అతిథి రీజియన్ చైర్మన్ లయన్ గుమ్మడిదల వెంకన్న, సెక్రటరీ లయన్ మంగళపర్తి వెంకటేశం అన్నారు.సర్వేపల్లి రాదాకృష్ణన్ జయంతిని పురస్కరించికొనిపోతిరెడ్డిపల్లి లోని విద్యానగర్ కమ్యూనిటీ భవనం నందు లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ ఆధ్వర్యములో గురుపూజోత్సవమును నిర్వహించి 27గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనముగా సన్మానించారు.ప్రోగ్రామ్ చైర్మన్స్ లయన్స్ శేషత్వం క్రిష్ణ, జూలకంటి ప్రభాకర్ ల దాతృత్వముతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకన్న, యం. వెంకటేశం, క్లబ్ అధ్యక్షులు శంకరి విజయెందర్ రెడ్డి, కో చైర్మన్ డి. హన్మత్ గౌడ్,డిస్ట్రిక్ట్ చైర్మన్ నాయికోటి రామప్ప పి. రాంగోపాల్, ఇతర బాధ్యులు అనంతరావు కుల్కర్ని, రామక్రి ష్ణా రెడ్డి, అల్లంరెడ్డి, లక్ష్మారెడ్డి, పి. బస్వరాజ్, రామచంద్రం, శ్రీధర్ రెడ్డి, జి.భరతయ్య, యస్. ప్రకాశ్, యాంకర్ క్రిష్ణ, అవార్డు గ్రహీతలతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.





మీ-సేవా కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు..!



పౌరులకు పారదర్శకంగా నిబంధనల ప్రకారం సేవలు

జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్

ములుగు, సెప్టెంబర్ 8, వార్త దిపీక న్యూస్ :

ములుగు జిల్లాలోని మీ-సేవా కేంద్రాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలను అందించాలని ములుగు అదనపు కలెక్టర్ సిహెచ్. మహేందర్ మీ-సేవా నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో స్పష్టం చేశారు. మీ-సేవ సేవల పేరుతో ప్రభుత్వం నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేయడం, అనధికార మధ్యవర్తిత్వానికి పాల్పడటం, ప్రజల నుంచి అధిక మొత్తాలను వసూలు చేయడం వంటి చర్యలను ఇకపై ఏమాత్రం సహించబోమని ఆయన హెచ్చరించారు. మీసేవ కేంద్రాలను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి ఎలక్ట్రానిక్స్ సర్వీస్ డెలివరీ గైడ్లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. ప్రజలతో ప్రతి



సందర్భంలోనూ మర్యాద పూర్వకంగా, సహనంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా కేంద్రాలను మూసివేయడం తీవ్రంగా పరిగణించబడుతుందని ఆదేశించారు. కేంద్రానికి సంబంధించిన నేమ్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు, మీ సేవ కేంద్రాల్లో నిర్దేశించిన మీ సేవ ప్రత్యేక రంగులను మాత్రమే ఉపయోగించాలని, పరిష్కారం కాల్ సెంటర్ 1100, సంబంధిత తహసీల్దార్ , ఇ ఎం డి సంప్రదింపు నంబర్లను ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, కేంద్రంలో తగిన వేగంతో పనిచేసే బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ సౌకర్యం ఉండాలని, అలాగే, అన్ని ఆధార్ కేంద్రాలు ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లోనే నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివకుమార్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ , మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీసేవ ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నాం

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్

మునిపల్లి, సెప్టెంబర్ 8, వార్త దిపీక న్యూస్ :



తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ పై కొత్త ప్రయోగం చేస్తున్నారని, వేల మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ ముట్టడిలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ అన్నారు. మంగళవారం కేసీఆర్ పై చేసిన కుంట్రలను ఖండిస్తున్నామనిప్రజా సమస్యలపై చర్చించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీలు అమలు చేయక, కుయుక్తులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోంది. ప్రతిపక్ష పార్టీ నిరసనలు, ర్యాలీలు చేస్తే, మేము చేస్తామని, నిరసనలు చేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుభద్రతతో చెలగాటం ఆడితేతెలంగాణ ప్రజలు సహించరని, రాజకీయ వివాదాలు ఉండొచ్చని, కానీ వ్యక్తిగత దాడులు, బెదిరింపులు, హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి ని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబర్ 8, వార్త దిపీక న్యూస్ :

రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రిగా చేయడమే ఏకైక లక్ష్యంగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని జిల్లా డిసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో జరిగిన ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీ ఎన్నికకోసం ఏర్పాటుచేసిన సంఘటన్ సృజన్ కార్యక్రమం లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందునుండి దేశ ప్రజలకు సేవ చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు నిచ్చారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ లింగం నాయక్ మాట్లాడుతూ ఆదివాసీలు, యానాదిలు, చెంచులు మొదటినుండి కాంగ్రెస్ పార్టీ కి అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ గిరిజనుడి కి గుర్తింపు ఇచ్చేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా కమిటీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్,జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ నాయక్, ఇంచార్జ్ కిషన్ నాయక్,బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో తొలి మహీంద్రా విద్యుత్ వాహనాల ప్రత్యేక వర్క్‌షాప్ ప్రారంభం.

వార్త దిపీక న్యూస్ :

ఏఎంపీఎల్ గ్రూప్ హైదరాబాద్‌లో మహీంద్రా వాహనాల కోసం భారతదేశపు తొలి విద్యుత్ వాహనాల ప్రత్యేక వర్క్‌షాప్‌ను బౌరంపేట, మియాపూర్ రోడ్‌లో ప్రారంభించింది. 14,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఏఎంపీఎల్ గ్రూప్‌కు 150వ మహీంద్రా టచ్‌పాయింట్‌గా నిలిచింది.ఈ వర్క్‌షాప్‌లో 14 సర్వీస్ బేలు, 180 కిలోవాట్ల అత్యంత వేగవంతమైన ఛార్జర్, 11 కిలోవాట్ల ఛార్జర్లు ఉన్నాయి. సంవత్సరానికి సుమారు 12,000 వాహనాలకు సేవలు అందించే సామర్థ్యంతో, 50 మంది ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది సేవలందించనున్నారు.ఈ సందర్భంగా ఏఎంపీఎల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సంగ్వీ మాట్లాడుతూ, "మా 150వ మహీంద్రా టచ్‌పాయింట్‌గా భారతదేశపు తొలి విద్యుత్ వాహనాల ప్రత్యేక వర్క్‌షాప్‌ను ప్రారంభించడం మాకు ఎంతో గర్వకారణం అన్నారు. మహీంద్రా విద్యుత్ వాహనాల ఉనికిని బలోపేతం చేయడంతో పాటు వినియోగదారులకు అత్యుత్తమ యాజమాన్య అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం అని తెలియజేశారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న మహీంద్రాతో మా భాగస్వామ్యం విశ్వాసం, పరస్పర అభివృద్ధి, వినియోగదారుల సంతృప్తిపై ఆధారపడి ఉందని తెలిపారు.2026 ఆర్థిక సంవత్సరంలో ఏఎంపీఎల్ గ్రూప్ 41,500 మహీంద్రా వాహనాల విక్రయాలను నమోదు చేసిందనీ మహీంద్రా బోర్న్ ఎలక్ట్రిక్ వాహనాల శ్రేణి ప్రారంభమైనప్పటి నుంచి గ్రూప్ 8,500కు పైగా విద్యుత్ వాహనాలను విక్రయించగా, సుమారు 26,000 విద్యుత్ వాహనాలకు సేవలు అందించిందన్నారు. ప్రస్తుతం ఆరు రాష్ట్రాల్లో 55 సర్వీస్ వర్క్‌షాప్‌లు, 642 సర్వీస్, బాడీషాప్ బేలు ఉన్నాయనీ తెలిపారు.

ఆరోగ్య భద్రతకు సీఎం రిలీఫ్ ఫండ్

పేదల ఆరోగ్యానికి బీఆర్ఎస్ అండ

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలు

వార్త దిపీక న్యూస్



అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఎల్ఓసీలను జీడిమెట్ల 132వ డివిజన్‌కు చెందిన నిరుపేద లబ్ధిదారులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "పేద ప్రజల ఆరోగ్య భద్రతే మా ప్రధాన లక్ష్యం. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడం మా బాధ్యత. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు" అని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై, వారికి అవసరమైన సమయంలో అండగా నిలవడం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజాసేవలో ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని రేవంత్ సర్కార్ వెంటనే గద్దె దిగాలి

అసెంబ్లీని కౌరవ సభగా మార్చి దుశ్శాసన పర్వానికి తెరలేపారు.. రానున్న ఎన్నికల్లో మహిళలే బుద్ధి చెబుతారు

కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తల ధర్నా

వార్త దీపిక న్యూస్ :

మహిళా ప్రజాప్రతినిధుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు అవమానకరంగా ఉందని ఆరోపిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు మంగళవారం చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు సోమవారం వస్తున్న బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్న తీరును నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు గౌరవం ఇస్తున్నామని చెప్పే సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన వ్యవహారంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ముఖ్యమంత్రి కనీసం విచారణకు ఆదేశించకపోవడం మహిళలను కించపరచడమేనని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్ల అమలుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే వారిని సభకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. అసెంబ్లీని కౌరవ సభగా మార్చి దుశ్శాసన పర్వానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, జుట్టు, చీర లాగడం వంటి ఘటనలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం



వ్యవహరిస్తున్న తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, నిరంకుశ ధోరణితో, కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని రేవంత్ సర్కార్ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా పేదలకు చేయూత.

పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

వార్త దీపిక న్యూస్ :

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా పేదలకు చేయూత లభిస్తోందని పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని రామ్ నరేష్ నగర్ కాలనీ కి చెందిన గజ్జ హేమ నరేందర్ రెడ్డికు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన ఒక లక్ష నూట పదహారు రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపేణా చైర్మన్ అరికెపూడి గాంధీ మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారని కొనియాడారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా ,మానవతా దృక్పథంతో కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, శ్రీధర్ రెడ్డి, యాసిన్, దేవేందర్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



బుడ్డా లింగం గౌడ్ సేవలు మరువలేనివి

ఘనంగా 8వ వర్ధంతి వేడుకలు

మాజీ కార్పొరేటర్ బుడ్డా విజయ శేఖర్ గౌడ్

వార్త దీపిక న్యూస్ :

కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, స్వర్గీయ బుడ్డా లింగం గౌడ్ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన కుమారుడు, రంగారెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బుడ్డా విజయ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం బుడ్డా లింగం గౌడ్ 8వ వర్ధంతి సందర్భంగా విజయనగర్ కాలనీ, కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని ఆయన విగ్రహాలకు కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి బుడ్డా విజయ శేఖర్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు రాజకీయ ఓనమాలు దిద్దించింది తన తండ్రి బుడ్డా లింగం గౌడ్ అని అన్నారు. తండ్రి చూపిన బాటలో నడుస్తూ పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని తెలిపారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ, నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తూ ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని బుడ్డా లింగం గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.



నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకున్న కూన శ్రీనివాస్ గౌడ్

ఘనంగా బోనాల మహోత్సవాలు.. భక్తులకు అన్నదానం

వార్త దీపిక న్యూస్ :

చింతల్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో పునర్నిర్మించిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల మహోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులు, దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను కూన శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నరసింహారావుతో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు ముత్యపాక నరసింహారావు, దాసరి వెంకటేష్, మేకల కుమార్, గోపాల్, పాండు తదితరులు పాల్గొన్నారు.



దూలపల్లి డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కూన శ్రీశైలం గౌడ్

వార్త దీపిక న్యూస్ :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆరోపించారు. అప్పట్లో రేషన్ కార్డు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం అందించడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరుతో గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్న అర్హులైన కుటుంబాలకు ఉపశమనం కలుగుతోందని తెలిపారు. నిరుపేదలకు ఉచిత బియ్యం అందించడంతో పాటు వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయిస్తున్నారని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన



ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు, మాజీ ఎంపీటీసీలు మోహన్ రావు, అశోక్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేష్, గోవర్ధన్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

వార్త దీపిక న్యూస్ :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎల్పీ విప్, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గారి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.49,67,000 విలువైన 129 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కరా..! రాజ్యాంగ పరిరక్షణలో రేవంత్ సర్కార్‌కు మంచి బుద్ధిని ప్రసాదించు

వార్త దీపిక న్యూస్ :

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లు, గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్ నగర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్‌ను కోరారు. అంతకుముందు చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ నగర్ వరకు బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. హామీల అమలులో జాప్యం



కారణంగా రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ల పెంపు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో తమ బాధ్యత అని, అయితే ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు పోలీసులను ఉపయోగించడం సరికాదని అన్నారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం రాజకీయ ఎదురుదాడులకు దిగుతోందని విమర్శించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులు కల్పించిందని, ఆ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం పనిచేసేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంబేద్కర్ మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

చింతల్ ఆర్యవైశ్య సంఘం కమ్యూనిటీ హాల్‌కు కృషి చేస్తా

కూన శ్రీశైలం గౌడ్

వార్త దీపిక న్యూస్ :

చింతల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరు కోసం ప్రభుత్వంతో మాట్లాడి తన వంతు సహకారం అందిస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం చింతల్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు షాపూర్‌నగర్‌లోని కూన శ్రీశైలం గౌడ్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరుకు సంబంధిత అధికారులతో మాట్లాడి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు కోసం తక్షణమే సంబంధిత రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పార్సి ప్రకాష్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షులు వస శ్రీనివాస్ గుప్త, చింతల్ అధ్యక్షులు విజయ్ కుమార్ గుప్త, సంఘం సభ్యులు ప్రభు రాజు గుప్త, కృష్ణమూర్తి గుప్త, రాజు గుప్తా, వీరేందర్ గుప్త, మురళి, శ్రీనివాస్, ఆంజనేయులు, రమేష్, సత్యప్రసాద్, నారాయణ, నల్ల రాజయ్య, బద్దయ్య, సంధ్య, శ్రావణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984